26–5–26 rakshana main_Layout 1  6/12/2026  12:20 AM  Page 1




APTEL/25/A5250

మన రాజధాని

# రక్షణ

నిజం మా బలం

ఎడిటర్ నరేంద్ర

గుంటూరు | సంపుటి -1 | సంచిక -97 | పేజీలు-4 | శుక్రవారం 12 జూన్ 2026 | వెల4/-

## నేటి నుంచి ఫుట్‌బాల్ మహాసంగ్రామం.

రికార్డు స్థాయిలో 48 జట్లు

మూడు దేశాల్లో ప్రపంచకప్ సందడి

నేడు మెక్సికో–సౌతాఫ్రికా పోరు

03



ఫుట్‌బాల్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫిఫా ప్రపంచకప్-2026 నేటి నుంచి ప్రారంభం కానుంది. అమెరికా, కెనడా, మెక్సికో సంయుక్త ఆతిథ్యంలో జరుగుతున్న ఈ మెగా టోర్నీలో రికార్డు స్థాయిలో 48 దేశాలు బరిలోకి దిగుతున్నాయి. తొలి మ్యాచ్‌లో ఆతిథ్య దేశం మెక్సికో, సౌతాఫ్రికాతో తలపడనుంది.



## మెగా డీఎస్సీకి ముహూర్తం

○అక్టోబర్‌లో నోటిఫికేషన్ ○డిసెంబర్‌లో పరీక్షలు

○అక్రమాలకు తావులేదు : కోన శశిధర్

రాష్ట్రంలో ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మంది అభ్యర్థు లకు మరో శుభవార్త అందింది. అక్టోబర్‌లో మెగా డీఎస్సీ నోటిఫికేషన్, డిసెంబర్‌లో పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసిందని విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ప్రకటించారు. డీఎస్సీ-2025 నియామకాలు పూర్తి పారదర్శకతతో జరిగాయని, అక్రమాలకు ఏమాత్రం తావు లేదని స్పష్టం చేశారు.

వివరాలు 2వ పేజీలో

## కమిషనర్ సార్... జరా సోచో...

◆చెరుకూరు ఆడిట్ రిపోర్టు ఎక్కడ..?◆



▶ 50 రోజులు గడిచినా కదలని వ్యవస్థ..!

▶ గోల్మాల్ ఆరోపణలపై ఆడిట్ నివేదిక కోరిన కమిషనర్...

▶ రోజులు గడుస్తున్న ఆడిట్.. ఫైల్‌కు బ్రేకులెవరు..?

02

బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గంలోని చెరుకూరు గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగం జరిగిందన్న ఆరోపణలపై పంచాయతీరాజ్ కమిషనర్ ప్రత్యేక ఆడిట్ బృందాన్ని నియమించి 50 రోజులు దాటినా నివేదికపై ఎలాంటి చర్యలు కనిపించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఆడిట్ పూర్తయి, నివేదిక జిల్లా అధికారుల వద్దకు చేరినట్లు సమాచారం ఉన్నప్పటికీ తదుపరి ప్రక్రియపై స్పష్టత లేకపోవడంతో గ్రామ ప్రజల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

### ప్రజల ప్రశ్నలు ఇవే..!

ఆడిట్ నివేదిక కలెక్టర్‌కు చేరిందా?

కమిషనర్ కార్యాలయానికి పంపించారా?

విచారణ పూర్తయితే చర్యలు ఎందుకు లేవు?

ఆరోపణలు ఎదుర్కొన్న అధికారికి ప్రమోషన్ ఎలా?

చెరుకూరు నిధుల లెక్కలు ఎప్పుడు బయటపడతాయి?

## మమత కోటకు బీటలు..!

▶ టీఎంసీలో తిరుగుబాటు సెగలు.. అభిషేక్‌పై బహిరంగ అసంతృప్తి

▶ పార్టీపై పట్టు సడలుతోందా..? బెంగాల్ రాజకీయాల్లో వేగంగా మారుతున్న సమీకరణాలు

▶ సీనియర్ల తిరుగుబాటు, బీజేపీ దూకుడు మధ్య మమతకు అతిపెద్ద రాజకీయ పరీక్ష

02



పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో దాదాపు పదిహేనేళ్లుగా అజేయ నాయకురాలిగా కొనసాగిన మమతా బెనర్జీ ఇప్పుడు తన రాజకీయ జీవితంలో అత్యంత క్లిష్టమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నట్లు కనిపిస్తోంది. ఒకవైపు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం తృణమూల్ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు బహిర్గతమవుతుండగా, మరోవైపు పార్టీ రెండో శ్రేణి నాయకత్వంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ముఖ్యంగా అభిషేక్ బెనర్జీ వ్యవహారశైలి, సీనియర్ నేతలకు తగ్గుతున్న ప్రాధాన్యం, రహస్య సమావేశాలు, బహిరంగ విమర్శలు టీఎంసీ భవిష్యత్తుపై సందేహాలు రేకెత్తిస్తున్నాయి. ఒకప్పుడు అప్రతిహతంగా కనిపించిన మమత నాయకత్వానికి ఇప్పుడు సొంత పార్టీలోనే సవాళ్లు ఎదురవుతుండటం బెంగాల్ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీసింది.

"మమతకు ఇప్పటికీ ప్రజల్లో ఆదరణ ఉంది. కానీ పార్టీ యంత్రాంగంలో పెరుగుతున్న అసంతృప్తి, వారసత్వ రాజకీయాలపై విమర్శలు, సీనియర్ నేతల తిరుగుబాటు స్వరాలు కలిసి టీఎంసీకి కొత్త సవాళ్లను సృష్టిస్తున్నాయి. ఈ పరిస్థితిని అధిగమించగలిగితే మమత మరోసారి తన రాజకీయ నైపుణ్యాన్ని నిరూపిస్తారు. లేకపోతే బెంగాల్ రాజకీయాల్లో అధికార సమీకరణాలు పూర్తిగా మారిపోయే అవకాశం ఉంది." -- ఎడిటర్

## ఎఫ్‌సీవీ పొగాకు కొనుగోళ్లలో పురోగతి

కొనుగోలుదారుల భాగస్వామ్యం పెరగడంతో రైతులకు ఊరట



02

## పేదల సాధికారతకు విద్యే బలమైన ఆయుధం

100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యం




వివరాలు 2వ పేజీలో

పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. గురుకులాల్లో విద్యా ప్రమాణాలతో పాటు మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతున్నట్లు వెల్లడించారు.

## వికసిత్ భారత్‌కు స్వర్ణాంధ్ర జోడింపు




వివరాలు 3వ పేజీలో

నీతి ఆయోగ్‌లో సీఎం విజన్

2047 లక్ష్యాల ఆవిష్కరణ

జనాభా విధానంపై కీలక ప్రతిపాదన

వికసిత్ భారత్-2047 లక్ష్యాలకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్‌లో స్వర్ణాంధ్ర-2047 విజన్ అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ఢిల్లీలో జరిగిన నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికలను వివరించిన ఆయన, మానవ వనరుల అభివృద్ధి, సాంకేతికత ఆధారిత పాలన, భారీ పెట్టుబడుల ఆకర్షణ, విద్యా సంస్కరణలు, ఆరోగ్య భద్రత, జనాభా నిర్వహణ విధానాలపై తన కార్యాచరణను వెల్లడించారు.

## భవిష్యత్ వైద్య విధానాల్లో క్వాంటం బయాలజీ కీలకం

ఎన్ఎంసీకి ప్రతిపాదనలు పంపనున్న డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం



02

## గురుకులంలో సైన్స్‌కు తాళం..!

◆డాక్టర్లు, ఇంజినీర్లు కావొద్దా..?

◆పేద బాలికల కలలపై కత్తి..!

◆జగ్గయ్యపేట గురుకులంపై ఆగ్రహ జ్వాలలు

03




జగ్గయ్యపేట అంబేద్కర్ గురుకుల బాలికల జూనియర్ కాలేజీలో ఎంపీసీ, బైపీసీ కోర్సులు లేకపోవడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. డాక్టర్లు, ఇంజినీర్లు కావాలనే లక్ష్యాలతో చదువుతున్న పేద బాలికలకు సైన్స్ విద్య అవకాశాలను పూర్తిగా దూరం చేయ డంపై విద్యార్థినులు, తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇతర గురుకులాల్లో సైన్స్ గ్రూపులు అందుబాటులో ఉండగా, జగ్గ య్యపేటలో మాత్రం వాటిని పక్కనపెట్టడాన్ని అన్యాయంగా అభివ ర్ణిస్తూ వెంటనే ఎంపీసీ, బైపీసీ కోర్సులను ప్రారంభించాలని డిమాండ్ చేస్తున్నారు.

## పాస్‌పోర్ట్ సేవల్లో ఏపీకి జాతీయ గుర్తింపు

పోలీసు వెరిఫికేషన్‌లో అత్యుత్తమ పనితీరు

రాష్ట్ర పోలీసులకు ప్రతిష్ఠాత్మక అవార్డు




03

పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ ప్రక్రియలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటిగా నిలిచింది. 2025-26 సంవత్సరానికి సంబంధించిన డేటా ఆధారంగా ఏపీ పోలీసు వ్యవస్థకు కేంద్ర విదేశాంగ శాఖ ప్రతిష్ఠాత్మక రాష్ట్ర పోలీసు సంస్థాగత పనితీరు అవార్డును ప్రకటించింది.

26–5–26 rakshana main_Layout 1 6/12/2026 12:20 AM Page 2



# ఎఫ్‌సీవీ పొగాకు కొనుగోళ్లలో పురోగతి

మొదటి పేజీ తరువాయి

అమరావతి, రక్షణ న్యూస్:

రాష్ట్రంలో ఎఫ్‌సీవీ పొగాకు కొనుగోళ్లు గత పది రోజులుగా గణనీయంగా మెరుగుపడుతున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. పొగాకు కొనుగోళ్ల పరిస్థితిపై సహచర మంత్రులు, ప్రజాప్రతినిధులతో గురువారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు.జూన్ 11 నాటికి టొబాకో బోర్డు ఆధ్వర్యంలోని వేలం కేంద్రాల ద్వారా 15.65 మిలియన్ కిలోగ్రాముల ఎఫ్‌సీవీ పొగాకు మార్కెటింగ్ జరిగిందని తెలిపారు. రాష్ట్రంలోని 16 వేలం కేంద్రాలకు రోజుకు సుమారు 8 వేల బేళ్ల పొగాకు వస్తుండటంతో కొనుగోళ్లు సజావుగా సాగుతున్నాయని చెప్పారు.గతంలో 30 నుంచి 37 శాతం వరకు ఉన్న తిరస్కరణలు ప్రస్తుతం 20 శాతానికి తగ్గడం సానుకూల పరిణామమని పేర్కొన్నారు. మార్కెట్‌లో పొగాకుకు డిమాండ్ పెరగడంతో పాటు కొనుగోలుదారుల భాగస్వామ్యం కూడా మెరుగుపడిందన్నారు.వ్యాపార వర్గాలు, ఎగుమతిదారులు, రైతు ప్రతినిధులతో టొబాకో బోర్డు నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని తెలిపారు. అన్ని గ్రేడ్ల పొగాకును సమతుల్యంగా మార్కెట్‌కు తీసుకువస్తే కొనుగోళ్లు మరింత పెరిగే అవకాశముందని వెల్లడించారు.రైతుల ప్రయోజనాల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం, టొబాకో బోర్డు పూర్తిస్థాయిలో కట్టుబడి ఉన్నాయని మంత్రి స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో మార్కెట్‌లో లిక్విడిటీ మరింత మెరుగుపడి కొనుగోలు, మార్కెటింగ్ కార్యకలాపాలు వేగవంతమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# భవిష్యత్ వైద్య విధానాల్లో క్వాంటం బయాలజీ కీలకం

మొదటి పేజీ తరువాయి

విజయవాడ, రక్షణ న్యూస్:

వైద్య పరిశోధనలు, చికిత్సా విధానాల్లో విప్లవాత్మక మార్పులకు 'క్వాంటం బయాలజీ' కీలకపాత్ర పోషించనుందని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ పులాల చంద్రశేఖర్ తెలిపారు. విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన "క్వాంటం బయాలజీ: అణువుల నుండి వైద్యం వరకు" అనే వెబ్‌నార్‌లో ఆయన మాట్లాడారు.క్వాంటం బయాలజీ వైద్యం, రోగ నిర్ధారణ, బయోమెడికల్ పరిశోధనల్లో విప్లవాత్మక మార్పులు తీసుకురాగల అభివృద్ధి చెందుతున్న రంగమని పేర్కొన్నారు. ఈ విభాగంలో డిప్లొమా, సర్టిఫికేట్ కోర్సులను ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉందన్నారు. దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో క్వాంటం బయాలజీ విద్య, శిక్షణా మాడ్యూళ్లను పాఠ్యాంశాల్లో చేర్చేలా జాతీయ వైద్య కమిషన్ (ఎన్‌ఎంసీ)కు ప్రతిపాదనలు పంపనున్నట్లు వెల్లడించారు.ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి పి.ఎస్. ప్రద్యుమ్న ఆన్‌లైన్ ద్వారా పాల్గొని ఆరోగ్య సంరక్షణ, పరిశోధన, ఆవిష్కరణల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో క్వాంటం సాంకేతికతల ప్రాధాన్యాన్ని వివరించారు. ప్రజా ఆరోగ్య వ్యవస్థల్లో క్వాంటం సైన్స్‌ను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వెల్లడించారు.ఐఐటీ తిరుపతి డైరెక్టర్ కె.ఎన్. సత్యనారాయణ ఆధునిక ఆరోగ్య సంరక్షణలో క్వాంటం భౌతికశాస్త్రం అవసరాన్ని వివరించగా, ఐఐటీ ఢిల్లీ, ఎయిమ్స్ ఢిల్లీకి చెందిన ప్రొఫెసర్ ఆరత్ కల్రా 'క్వాంటం జీవశాస్త్రం: అణువుల నుండి వైద్యం వరకు' అంశంపై ప్రధాన ఉపన్యాసం చేశారు.ఈ సెమినార్‌లో అనుబంధ వైద్య కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొని క్వాంటం బయాలజీపై తమ అవగాహనను పెంపొందించుకున్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ టి. సాయి సుధీర్, పబ్లికేషన్స్ డైరెక్టర్ డాక్టర్ కె. సుధ, ఏక్యూవీ డైరెక్టర్ శ్రీధర్, ఏపీఎస్ఏహెచ్‌పీసీ కార్యదర్శి సుమైలా తదితరులు పాల్గొన్నారు.

# పేదల సాధికారతకు విద్యే బలమైన ఆయుధం

మొదటి పేజీ తరువాయి

అమరావతి, రక్షణ న్యూస్:

పేద కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించి వారిని సమాజంలో ఉన్నత స్థానాలకు చేర్చాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు. అంబేద్కర్ గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో కార్పొరేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోని విధంగా విద్యా బోధనతో పాటు ఆధునిక సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు.విజయవాడలో నిర్వహించిన అంబేద్కర్ గురుకులాల డీసీవోలు, ప్రిన్సిపాళ్లు, సోషల్ వెల్ఫేర్ డీడీలు, ఏఎస్‌డబ్ల్యూవోల వర్క్‌షాప్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ విద్య ద్వారానే పేదల సాధికారత సాధ్యమవుతుందని అన్నారు. ఈ లక్ష్యంతోనే ప్రభుత్వం గురుకుల విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తోందని చెప్పారు.పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని మంత్రి సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శిక్షణ అందించాలని, వారి ప్రతిభను మెరుగుపరిచే చర్యలు చేపట్టాలని కోరారు. ప్రతి విద్యార్థి లక్ష్యసాధనకు ఉపాధ్యాయులు మార్గదర్శకులుగా వ్యవహరించాలని అన్నారు.ప్రభుత్వం అమలు చేస్తున్న 100 డేస్ యాక్షన్ ప్లాన్, ముస్తాబు కార్యక్రమాలను ప్రతి పాఠశాలలో సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. పాఠశాలల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, మరుగుదొడ్లు, తరగతి గదులు, ప్రాంగణాలు ఎల్లప్పుడూ శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని మంత్రి స్పష్టం చేశారు. విద్యార్థుల మానసిక పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ అవసరమైన కౌన్సెలింగ్ అందించాలని సూచించారు. విద్యతో పాటు నైతిక విలువలు, సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పించాలని చెప్పారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అంశాలపై కూడా విద్యార్థులకు సరైన అవగాహన కల్పించాలని సూచించారు.ఐఐటీ, నీట్ ప్రవేశ పరీక్షల్లో ఎక్కువ మంది విద్యార్థులు సీట్లు సాధించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. ఎక్సలెన్సీ సెంటర్ల సంఖ్యను మూడు నుంచి పది వరకు పెంచినట్లు వెల్లడించారు. ఈ ఏడాది మరో మూడు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో సీసీ కెమెరాలు, ఆర్వో ప్లాంట్లు, మెకనైజ్డ్ కిచెన్లు ఏర్పాటు చేసి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ఐవీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్‌లో విద్యార్థులు, తల్లిదండ్రులు వంద శాతం సంతృప్తి వ్యక్తం చేసే స్థాయిలో సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డా. బి.ఆర్. అంబేద్కర్ గురుకులాల సంస్థ కార్యదర్శి ఐఏఎస్ వి. ప్రసన్న వెంకటేష్, సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ ఐఏఎస్ బి. లావణ్య వేణి, అదనపు డైరెక్టర్ సునీల్ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కమిషనర్ సార్... జరా సోచో..

మొదటి పేజీ తరువాయి

అమరావతి రక్షణ బ్యూరో...

బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గంలోని చెరుకూరు గ్రామ పంచాయతీ ప్రస్తుతం మరోసారి చర్చనీయాంశంగా మారింది. గత మూడేళ్ల కాలంలో పంచాయతీకి వచ్చిన నిధులు, వాటి వినియోగం, లెక్కల నిర్వహణపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తడంతో పంచాయతీరాజ్ కమిషనర్ ప్రత్యేక ఆడిట్ బృందాన్ని నియమించారు. పీజీఆర్ఎస్‌లో నమోదైన ఫిర్యాదు ఆధారంగా ఈ విచారణకు ఆదేశాలు జారీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది.ప్రత్యేక ఆడిట్ బృందం చెరుకూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించి, అనంతరం జిల్లా కేంద్రంలో పలు రోజుల పాటు ఆర్థిక లావాదేవీలను క్షుణ్ణంగా విశ్లేషించినట్లు సమాచారం. పంచాయతీ నిధుల వినియోగానికి సంబంధించిన బిల్లులు, వౌచర్లు, పనుల అమలు, చెల్లింపుల ప్రక్రియలపై సమగ్ర పరిశీలన జరిపినట్లు తెలుస్తోంది.ఆడిట్ ప్రక్రియ పూర్తయి దాదాపు వారం రోజులు దాటినా నివేదికపై ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడకపోవడం పలు ప్రశ్నలకు దారితీస్తోంది. నివేదిక జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరిందా? చేరి ఉంటే తదుపరి చర్యలు ఏమిటి? పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయానికి నివేదిక పంపించబడిందా? లేదా ఇంకా పెండింగ్‌లో ఉందా? అనే ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి.ఇదే సమయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న పంచాయతీ కార్యదర్శికి ఆడిట్ జరుగుతున్న సమయంలోనే పదోన్నతి, బదిలీ లభించడం కూడా చర్చనీయాంశంగా మారింది. విచారణ పూర్తికాకముందే బాధ్యతల మార్పు జరగడం వెనుక కారణాలేమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం మరో అధికారి అదనపు బాధ్యతలతో వ్యవహరిస్తున్నప్పటికీ అసలు అంశంపై స్పష్టత రావడం లేదు.మరోవైపు స్థానిక మీడియా కథనాల ఆధారంగా జిల్లా స్థాయిలో ప్రత్యేక విచారణకు కూడా ఆదేశాలు జారీ అయినట్లు సమాచారం. సంబంధిత అధికారులను విచారణాధికారులుగా నియమించినప్పటికీ ఆ నివేదిక ఎక్కడ ఉందో, అది కలెక్టర్ దృష్టికి వెళ్లిందో లేదో కూడా స్పష్టత లేదు. విచారణలపై విచారణలు జరుగుతున్నప్పటికీ ఫలితాలు మాత్రం బయటకు రావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.చెరుకూరు పంచాయతీలో లక్షల రూపాయల నిధుల వినియోగంపై అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో కమిషనర్ స్థాయి ఆడిట్ నిర్వహించడం చిన్న విషయం కాదు. అలాంటి ఆడిట్ నివేదికపై ఆలస్యం జరుగుతుండటం మరిన్ని సందేహాలకు కారణమవుతోంది. నిజంగా ఎలాంటి అక్రమాలు జరగలేదంటే నివేదికను వెంటనే బహిర్గతం చేయాలని, ఆరోపణలు నిరాధారమని ప్రజలకు తెలియజేయాలని స్థానికులు కోరుతున్నారు.అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ నిధుల వినియోగంలో పారదర్శకతను నిరూపించాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజా ధనానికి సంబంధించిన అంశాల్లో జాప్యం మరింత అనుమానాలకు తావిస్తుందని వారు పేర్కొంటున్నారు. ప్రస్తుతం అందరి చూపు పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంపైనే ఉంది. ప్రత్యేక ఆడిట్ బృందం నివేదికలో ఏముంది? ఎవరిపై ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి? తదుపరి చర్యలు ఏమిటి? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. చెరుకూరు పంచాయతీ వ్యవహారంపై ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.ఇప్పటికైనా కమిషనర్ కార్యాలయం స్పందించి ఆడిట్ నివేదిక స్థితిగతులను వెల్లడిస్తుందా? లేక ఈ ఫైల్ కూడా ఇతర ఫైళ్ల మాదిరిగానే మూలన పడిపోతుందా? అనే ప్రశ్నలకు సమాధానం రావాల్సి ఉంది.

# మెగా డీఎస్సీకి ముహూర్తం

మొదటి పేజీ తరువాయి

అమరావతి, రక్షణ న్యూస్

రాష్ట్రంలో ఉపాధ్యాయ నియామకాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు ప్రభుత్వం మరోసారి స్పష్టమైన హామీ ఇచ్చింది. ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌కు అనుగుణంగా అక్టోబర్ నెలలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి, డిసెంబర్‌లో పరీక్షలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించినట్లు రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ వెల్లడించారు. గురువారం సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో రాష్ట్ర క్రీడల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, శాప్ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ భరణితో కలిసి ఆయన డీఎస్సీ–2025 నియామకాలపై సమగ్ర వివరణ ఇచ్చారు.డీఎస్సీ నియామకాలపై కొందరు అభ్యర్థులు వ్యక్తం చేస్తున్న సందేహాలు, సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాల్లో వాస్తవం లేదని కోన శశిధర్ స్పష్టం చేశారు. హారిజాంటల్ రిజర్వేషన్లు, స్పోర్ట్స్ కోటా, దివ్యాంగుల కోటా అమలులో ప్రభుత్వం చట్టబద్ధంగా, నిబంధనలకు అనుగుణంగానే వ్యవహరించిందన్నారు. అభ్యర్థులందరికీ సమాన అవకాశాలు కల్పించేలా మొత్తం ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించామని పేర్కొన్నారు.2024లో నోటిఫై చేసిన సుమారు 6,100 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ఆలస్యానికి గల కారణాలను కూడా ఆయన వివరించారు. సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులకు అనుగుణంగా హారిజాంటల్ రిజర్వేషన్ల అమలులో పూర్తి స్పష్టత తీసుకురావాల్సి వచ్చిందన్నారు. అదే సమయంలో టెట్, డీఎస్సీ ప్రక్రియలను సమన్వయంతో నిర్వహించి అభ్యర్థులకు గందరగోళం లేకుండా చూడాల్సిన అవసరం ఏర్పడిందని చెప్పారు. ఈ రెండు కారణాల వల్లే నియామక ప్రక్రియకు అదనపు సమయం పట్టిందని వివరించారు.డీఎస్సీ పరీక్షల్లో పేపర్ లీకేజీ జరిగే అవకాశమే లేదని కోన శశిధర్ స్పష్టం చేశారు. మొత్తం నియామక ప్రక్రియ డిజిటల్ విధానంలో నిర్వహించబడిందని, సిస్టమ్‌కు అత్యంత పరిమిత యాక్సెస్ మాత్రమే ఉంటుందని చెప్పారు. కేవలం ఇద్దరు శాశ్వత ఉద్యోగులకు మాత్రమే డేటా అప్‌లోడ్ చేసే అధికారం ఉంటుందని వెల్లడించారు. పాస్‌వర్డులు నిరంతరం మారుస్తూ ఉండటంతో అనధికార ప్రవేశానికి అవకాశం ఉండదన్నారు. అందువల్ల పేపర్ లీకేజీ, డేటా లీకేజీ ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేశారు.మెరిట్ లిస్ట్ పూర్తిగా నిబంధనల ప్రకారమే రూపొందించినట్లు ఆయన తెలిపారు. టెట్ మార్కులకు 20 శాతం, డీఎస్సీ మార్కులకు 80 శాతం వెయిటేజీ ఇచ్చి జనరల్ మెరిట్ లిస్ట్ తయారు చేశామని చెప్పారు. టెట్ మార్కులను ఇప్పటికే అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు గుర్తుచేశారు.సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు కాల్ లెటర్ రావడం అంటే ఉద్యోగం ఖరారైనట్లు కాదని మరోసారి స్పష్టం చేశారు. అభ్యర్థుల అర్హతలు, హారిజాంటల్ రిజర్వేషన్లు, ధ్రువపత్రాల పరిశీలన అనంతరం మాత్రమే తుది ఎంపిక జరుగుతుందని తెలిపారు. ఒక అభ్యర్థి అనర్హుడిగా తేలితే తదుపరి అర్హత కలిగిన అభ్యర్థికి అవకాశం దక్కుతుందని వివరించారు.అభ్యర్థుల ఫిర్యాదుల పరిష్కారానికి ప్రభుత్వం మూడు స్థాయిల గ్రీవెన్స్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు కోన శశిధర్ వెల్లడించారు. జిల్లా స్థాయి పరిశీలన, రాష్ట్ర స్థాయి కమిటీ, కమిషనర్ స్థాయి తుది సమీక్ష ద్వారా ప్రతి అభ్యంతరాన్ని నిష్పాక్షికంగా పరిశీలించినట్లు తెలిపారు. ప్రతి ఫిర్యాదును న్యాయబద్ధంగా పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామని చెప్పారు.స్పోర్ట్స్ కోటా నియామకాలపై రాష్ట్ర క్రీడల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ వివరణ ఇచ్చారు. ప్రభుత్వం అమలులో ఉన్న జీఓల ప్రకారం పూర్తిస్థాయి పారదర్శకతతోనే ఎంపికలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రస్తుతం అమల్లో ఉన్న జీఓ ఎంఎస్ నెం.4 ప్రకారం ఇంటర్ కాలేజియేట్ పోటీల్లో పాల్గొనడం లేదా సాధించిన విజయాలను ఉద్యోగ అర్హతగా పరిగణించడం లేదని స్పష్టం చేశారు.అయితే గతంలో అమల్లో ఉన్న జీఓ ఎంఎస్ నెం.74 ప్రకారం ఇంటర్ కాలేజియేట్, ఇంటర్ డిస్ట్రిక్ట్, రూరల్ స్పోర్ట్స్, మహిళా క్రీడా ఉత్సవాలు, ఎస్‌జీఎఫ్ఐ పోటీలను కూడా పరిగణనలోకి తీసుకున్నట్లు వివరించారు. 2019 గ్రామ, వార్డు సచివాలయ నియామకాలలో కూడా అదే విధానం అమలైందన్నారు.ప్రస్తుత డీఎస్సీ నియామకాలలో మాత్రం జాతీయ క్రీడలు, జాతీయ ఛాంపియన్‌షిప్‌లు, ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ, సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ, రాష్ట్ర స్థాయి ఛాంపియన్‌షిప్‌లు, అంతర్జాతీయ పోటీలలో సాధించిన విజయాలకు మాత్రమే ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలిపారు. జీఓ–4 ప్రకారం అత్యున్నత క్రీడా ప్రతిభను ప్రోత్సహించే విధానాన్ని ప్రభుత్వం అనుసరించిందన్నారు.డీఎస్సీ–2025లో స్పోర్ట్స్ కోటా కింద మొత్తం 382 మంది అభ్యర్థులు ఎంపిక ప్రక్రియలో భాగమయ్యారని వెల్లడించారు. వీరిలో 22 మంది స్వర్ణ పతక విజేతలు, 40 మంది రజత పతక విజేతలు, 43 మంది కాంస్య పతక విజేతలు ఉండగా, 275 మంది జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడాకారులు ఉన్నారని తెలిపారు. ఖోఖో, బాల్ బ్యాడ్మింటన్, జూడో, సాఫ్ట్‌బాల్, అథ్లెటిక్స్, వాలీబాల్, హ్యాండ్‌బాల్, హాకీ సహా 34 క్రీడా విభాగాలకు చెందిన క్రీడాకారులు ఈ ఎంపికల్లో భాగస్వాములయ్యారని చెప్పారు.ప్రతి క్రీడా సర్టిఫికెట్‌పై బహుస్థాయి ధ్రువీకరణ నిర్వహించినట్లు అజయ్ జైన్ తెలిపారు. స్క్రూటినీ కమిటీ, రాష్ట్ర స్థాయి కమిటీ, సంబంధిత క్రీడా సంఘాలు, యూనివర్సిటీలు, అధికారిక రికార్డుల ద్వారా పరిశీలన జరిపిన తర్వాతే అర్హత నిర్ణయించినట్లు వెల్లడించారు. 1996 నుంచి 2025 వరకు జారీ అయిన సర్టిఫికెట్లను కూడా పరిశీలించినట్లు తెలిపారు.అనిగి దుర్గయ్య కేసుపై స్పందిస్తూ, ఆయన జాతీయ క్రీడలకు సంబంధించిన సర్టిఫికెట్‌ను ఆన్‌లైన్ దరఖాస్తు సమయంలో అప్‌లోడ్ చేయలేదని వివరించారు. భౌతిక ధ్రువీకరణ సమయంలో సమర్పించిన పత్రాలను జీఓ–4 ప్రకారం పరిగణనలోకి తీసుకునే అవకాశం లేదన్నారు. నోటిఫికేషన్‌లో పేర్కొన్న గడువులోనే సర్టిఫికెట్లు సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.క్రీడాకారులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం ద్వారా రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యమని శాప్ వైస్ చైర్మన్ భరణి తెలిపారు. ప్రతిభావంతులైన క్రీడాకారులకు ఉపాధి అవకాశాలు కల్పించడం వల్ల మరింత మంది యువత క్రీడల వైపు ఆకర్షితులవుతారని పేర్కొన్నారు.ఈ సమావేశంలో రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా కూడా పాల్గొన్నారు.

# మమత కోటకు బీటలు..!

మొదటి పేజీ తరువాయి

ఎడిటర్ విశ్లేషణ

పశ్చిమ బెంగాల్ రాజకీయ చరిత్రలో మమతా బెనర్జీ ఒక ప్రత్యేక అధ్యాయం. వామపక్షాల 34 ఏళ్ల ఏకపక్ష పాలనకు ముగింపు పలికి 2011లో అధికారంలోకి వచ్చిన ఆమె, కేవలం ముఖ్యమంత్రిగానే కాకుండా ప్రజల్లో "దీదీ"గా అపారమైన ఆదరణ పొందారు. సామాన్య ప్రజల సమస్యలను రాజకీయ ఆయుధాలుగా మలుచుకుని, ఉద్యమాల ద్వారా అధికారాన్ని సాధించిన మమతా బెనర్జీ భారత రాజకీయాల్లో అరుదైన నాయకురాలిగా నిలిచారు.అయితే రాజకీయాల్లో ఎవరూ శాశ్వత విజేతలు కారనే వాస్తవాన్ని ఇప్పుడు బెంగాల్ రాజకీయాలు మరోసారి గుర్తు చేస్తున్నాయి. ఒకప్పుడు పార్టీ అంటే మమత, మమత అంటే పార్టీ అన్న పరిస్థితి ఉండేది. కానీ ఇప్పుడు అదే పార్టీలో విభేదాల స్వరాలు వినిపించడం పరిస్థితి ఎంతగా మారిందో సూచిస్తోంది.ఇటీవలి రాజకీయ పరిణామాలు చూస్తే టీఎంసీ ఎదుర్కొంటున్న సమస్య కేవలం ఎన్నికల ఓటమి కాదు. అది నాయకత్వంపై విశ్వాస సంక్షోభంగా మారుతున్నట్లు కనిపిస్తోంది. ఎన్నికల్లో ఎదురుదెబ్బ తగిలిన తర్వాత సాధారణంగా పార్టీలు ఆత్మపరిశీలన చేస్తాయి. కానీ టీఎంసీలో ఆ ప్రక్రియ జరగకుండా అంతర్గత అసంతృప్తి బయటకు రావడం ఆందోళనకర అంశంగా మారింది.పార్టీకి చెందిన కొందరు ఎమ్మెల్యేలు రహస్య సమావేశాలు నిర్వహించారన్న ప్రచారం, శాసనసభా పక్ష నేత నియామకంపై వివాదాలు, సంతకాల ఫోర్జరీ ఆరోపణలు---ఇవన్నీ పార్టీలోని అంతర్గత సంక్షోభాన్ని సూచిస్తున్నాయి. ఈ పరిణామాలు ఒక్కరోజులో ఏర్పడినవి కావు. చాలా కాలంగా పేరుకుపోతున్న అసంతృప్తి ఇప్పుడు బయటపడుతోందన్న సంకేతాలు కనిపిస్తున్నాయి.ఈ సంక్షోభానికి కేంద్రబిందువుగా అభిషేక్ బెనర్జీ పేరు వినిపించడం గమనార్హం. మమతా బెనర్జీ తర్వాత పార్టీ భవిష్యత్తు నాయకుడిగా అభిషేక్‌ను ప్రాజెక్ట్ చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్న భావన చాలామంది సీనియర్ నేతల్లో అసంతృప్తిని పెంచింది. పార్టీ నిర్ణయాలు కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమవుతున్నాయన్న ఆరోపణలు కొత్తవి కావు. అయితే ఇప్పుడు అవే విమర్శలు బహిరంగంగా వినిపించడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.ఇటీవల ఎంపీ కల్యాణ్ బెనర్జీ చేసిన వ్యాఖ్యలు టీఎంసీ రాజకీయాల్లో కీలక మలుపుగా భావించవచ్చు. ఆయన కేవలం అభిషేక్‌పై విమర్శలు చేయడమే కాకుండా, సీనియర్ నాయకత్వం పట్ల నిర్లక్ష్య వైఖరి పార్టీకి నష్టం కలిగిస్తోందని బహిరంగంగా వ్యాఖ్యానించారు. సంతకాల ఫోర్జరీ కేసులో తనను న్యాయవాదిగా తొలగించడం అవమానకరమని చెప్పడం, నాయకత్వ నిర్ణయాలపై ప్రశ్నలు లేవనెత్తడం టీఎంసీలోని అసంతృప్తి ఎంత లోతుగా ఉందో చూపిస్తోంది.రాజకీయాల్లో నాయకత్వ మార్పు సహజ ప్రక్రియే. కానీ ఆ మార్పు అందరి అంగీకారంతో జరగాలి. లేకపోతే అది విభేదాలకు దారితీస్తుంది. ప్రస్తుతం టీఎంసీలో కనిపిస్తున్న పరిస్థితి కూడా అదే. మమత తర్వాత పార్టీ ఎవరి చేతుల్లో ఉండాలి అన్న ప్రశ్నకు స్పష్టమైన సమాధానం లేకపోవడం వల్లే ఈ సంక్షోభం మరింత తీవ్రమవుతున్నట్లు కనిపిస్తోంది.మరో ముఖ్యమైన అంశం మమతా బెనర్జీ నిర్వహించిన నిరసన కార్యక్రమాలకు తగ్గుతున్న స్పందన. గతంలో ఆమె పిలుపునిస్తే వేలాది మంది నాయకులు, కార్యకర్తలు తరలివచ్చేవారు. ఇప్పుడు మాత్రం పరిమిత సంఖ్యలోనే ప్రజాప్రతినిధులు హాజరుకావడం రాజకీయంగా ప్రతికూల సంకేతంగా మారింది. ప్రజల్లో ఆదరణ తగ్గిందని చెప్పలేము కానీ పార్టీ యంత్రాంగంలో ఉత్సాహం తగ్గిందన్న అభిప్రాయం బలపడుతోంది.ఈ పరిస్థితిని బీజేపీ పూర్తిగా తమకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నం చేస్తోంది. గత కొన్ని సంవత్సరాలుగా బెంగాల్‌లో ప్రధాన ప్రతిపక్షంగా ఎదిగిన బీజేపీ, టీఎంసీ అంతర్గత సంక్షోభాన్ని రాజకీయ అవకాశంగా చూస్తోంది. పార్టీని వీడుతున్న నేతలను ఆకర్షించడం, ప్రభుత్వ వైఫల్యాలపై ప్రచారం చేయడం, చట్టవ్యవస్థ అంశాన్ని ముందుకు తేవడం వంటి వ్యూహాలతో బీజేపీ ముందుకెళ్తోంది.అయితే మమతా బెనర్జీని రాజకీయంగా తక్కువ అంచనా వేయడం కూడా సరైంది కాదు. గతంలో ఎన్నో సంక్షోభాలను ఆమె ఎదుర్కొన్నారు. పార్టీ విభేదాలు, కేంద్ర ప్రభుత్వాలతో ఘర్షణలు, ఎన్నికల సవాళ్లు---ఇవన్నీ దాటుకుని ఆమె మళ్లీ నిలబడ్డ సందర్భాలు ఉన్నాయి. అందువల్ల ప్రస్తుత పరిస్థితి టీఎంసీ ముగింపు అని చెప్పడం తొందరపాటు అవుతుంది.కానీ ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. మమతా బెనర్జీ రాజకీయంగా ఇప్పటివరకు ఎదుర్కొన్న అతిపెద్ద అంతర్గత సవాల్ ఇదే. బయట ప్రత్యర్థులతో పోరాడటం ఒకటి అయితే, సొంత పార్టీలోనే అసంతృప్తిని నియంత్రించడం మరో విషయం. ప్రస్తుతం ఆమె ముందున్న అసలు పరీక్ష అదే.టీఎంసీ భవిష్యత్తు ఇప్పుడు మూడు అంశాలపై ఆధారపడి ఉంది. మొదటిది పార్టీ ఐక్యతను కాపాడుకోవడం. రెండోది సీనియర్ నేతల అసంతృప్తిని తగ్గించడం. మూడోది ప్రజల్లో పార్టీపై విశ్వాసాన్ని పునరుద్ధరించడం. ఈ మూడు లక్ష్యాల్లో విజయవంతమైతే టీఎంసీ మళ్లీ బలపడే అవకాశం ఉంది. లేకపోతే బెంగాల్ రాజకీయాల్లో కొత్త అధ్యాయం ప్రారంభమయ్యే అవకాశాన్ని కొట్టిపారేయలేం.ప్రస్తుతం చూస్తే బెంగాల్ రాజకీయాల్లో మార్పు గాలులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఒకప్పుడు అజేయంగా కనిపించిన మమతా బెనర్జీ నాయకత్వం ఇప్పుడు తీవ్రమైన పరీక్షను ఎదుర్కొంటోంది. ఈ సంక్షోభాన్ని ఆమె ఎలా అధిగమిస్తారన్నది కేవలం టీఎంసీ భవిష్యత్తునే కాదు, దేశ రాజకీయాలపై కూడా ప్రభావం చూపే అంశంగా మారింది.

# వికసిత్ భారత్‌కు స్వర్ణాంధ్ర జోడింపు

మొదటి పేజీ తరువాయి

ఢిల్లీ రక్షణ న్యూస్....

ఢిల్లీలో జరిగిన నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి రూపొందించిన స్వర్ణాంధ్ర-2047 విజన్‌ను దేశం ముందుంచారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా అభినందనలు తెలిపిన సీఎం, గత దశాబ్ద కాలంలో భారత్ పాలసీ పెరాలసిస్ నుంచి పాలసీ గ్రోత్ దిశగా పయనించిందన్నారు. డిజిటల్ ఇండియా, జనధన్, ఆధార్, యూపీఐ, మేక్ ఇన్ ఇండియా వంటి కార్యక్రమాలు దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేశాయని చెప్పారు. భౌగోళిక రాజకీయ అనిశ్చితులు ఉన్నప్పటికీ భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా ఎదుగుతున్న పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందన్నారు. ప్రధాని మోదీ రూపకల్పన చేసిన వికసిత్ భారత్-2047కు అనుసంధానంగానే స్వర్ణాంధ్ర-2047 విజన్ రూపొందించామని, అభివృద్ధికి మానవ వనరులే పునాదిగా ఈ కార్యాచరణ సిద్ధమైందని వివరించారు. పేదరిక నిర్మూలన, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, నీటి-ఇంధన భద్రత, అగ్రిటెక్, గ్లోబల్ లాజిస్టిక్స్, డీప్ టెక్నాలజీ వంటి పది కీలక అంశాలను లక్ష్యాలుగా నిర్దేశించామని తెలిపారు.

ఈ లక్ష్యాల సాధనకు సాంకేతికత ఆధారిత, డేటా ఆధారిత పారదర్శక పాలనా వ్యవస్థను అమలు చేస్తున్నామని చెప్పారు. ఆర్టీజీఎస్ ద్వారా కీలక పనితీరు సూచికలను పర్యవేక్షిస్తున్నామని, వాతావరణ పరిస్థితులు, పంటల స్థితిగతులు, భూగర్భ జలాల స్థాయి సహా 41 రకాల సమాచారాన్ని రియల్ టైమ్‌లో విశ్లేషించి ప్రజలకు అందిస్తున్నామని వెల్లడించారు. 'మన మిత్ర' వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజల ఇంటి వద్దకే తీసుకెళ్లామని పేర్కొన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో గత రెండేళ్లలో రూ. 23 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించగలిగామని తెలిపారు.

పెట్టుబడుల ఆకర్షణలో రాష్ట్రాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ అవసరమేనని, అయితే అస్థిర విధానాలు దేశాభివృద్ధికి మేలు చేయవని అభిప్రాయపడ్డారు. అత్యుత్తమ మౌలిక సదుపాయాలు, వేగవంతమైన అనుమతులు, విధాన స్థిరత్వం పెట్టుబడుల పెరుగుదలకు కీలకమని చెప్పారు. గృహ నిర్మాణం, పారిశుద్ధ్యం, తాగునీరు, వంటగ్యాస్, విద్యుత్, డిజిటల్ కనెక్టివిటీ, డీబీటీ వంటి సేవలను ప్రతి కుటుంబానికి అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సమాజంలో ఆర్థిక అసమానతలను తగ్గించేందుకు పీ4 కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని, ఆరోగ్యరంగంలో సంజీవని కార్యక్రమం ద్వారా ప్రతి పౌరుడికి డిజిటల్ హెల్త్ రికార్డులు రూపొందిస్తున్నామని తెలిపారు. ఆయుష్మాన్ భారత్‌తో అనుసంధానం ద్వారా అందరికీ ఆరోగ్య భద్రత కల్పించడమే లక్ష్యమన్నారు. యోగా, ధ్యానం వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను ప్రోత్సహిస్తూ మానవ వనరుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టామని చెప్పారు. విద్యారంగంలో ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు సమూల సంస్కరణలు చేపట్టామని, గ్యారంటీడ్ ఎఫ్ఎల్ఎన్, ఏఐ ఆధారిత అడాప్టివ్ లెర్నింగ్ విధానాలతో విద్యార్థుల ఫలితాలను మెరుగుపరుస్తున్నామని వెల్లడించారు. వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ మోడల్ ద్వారా చదువుతో పాటు నైపుణ్యాలు కూడా అందిస్తున్నామని చెప్పారు. నైపుణ్యం పోర్టల్, పీఎం సేతు ద్వారా యువతను ఏఐ, క్వాంటం టెక్నాలజీ వంటి భవిష్యత్ రంగాలకు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు 1.5 కంటే దిగువకు పడిపోవడం ఆందోళనకరమని పేర్కొన్న సీఎం, భవిష్యత్తులో మానవ వనరుల కొరత తలెత్తకుండా ప్రత్యేక జనాభా నిర్వహణ విధానాన్ని రూపొందిస్తున్నామని వెల్లడించారు. ఈ అంశంపై జాతీయ స్థాయిలో కూడా కార్యాచరణ అవసరమని సూచించారు. వికసిత్ భారత్-2047 లక్ష్య సాధనలో కేంద్ర, రాష్ట్రాల మధ్య నిరంతర భాగస్వామ్యం అవసరమని, ఆ లక్ష్యాల సాధనకు నీతి ఆయోగ్‌తో కలిసి పనిచేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పూర్తిగా సిద్ధంగా ఉందని చంద్రబాబు స్పష్టం చేశారు.

# గ్రీవెన్స్‌లో సమస్యల వెల్లువ

## ఆనం, నాగుల్ మీరా ఎదుట వినతులు

అమరావతి, రక్షణ న్యూస్:

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో వివిధ జిల్లాలకు చెందిన బాధితులు తమ వినతులను సమర్పించారు. దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఏపీ నూర్‌బాషా కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి సమస్యలను విన్నారు. ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడికి చెందిన చిగురుపాటి వెంకటేశ్వరరావు తన స్థలానికి సంబంధించిన పత్రాల వివాదం, కాంపౌండ్ వాల్ కూల్చివేత అంశాలపై ఫిర్యాదు చేశారు. సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరుకు చెందిన చెల్లింకుల దేవీకృష్ణ తన కూరగాయల దుకాణాన్ని ధ్వంసం చేశారని, బెదిరింపులకు పాల్పడుతున్నారని ఫిర్యాదు చేశారు. జీవనాధారమైన వ్యాపారాన్ని రక్షించాలని విజ్ఞప్తి చేశారు. తిరుపతి జిల్లా తొండవాడ గ్రామానికి చెందిన వావులూరు పెరుమాళ్ తన వ్యవసాయ భూమికి నీటి సరఫరా అడ్డుకోవడంతో పంట నష్టపోయానని విన్నవించారు. జీవనోపాధి కోసం తిరుమలలో చిన్న అంగడి కేటాయించాలని అభ్యర్థించారు. ఇవే కాకుండా



పలువురు పింఛన్లు, రేషన్ కార్డులు, గృహ నిర్మాణాలు, ఉద్యోగ అవకాశాలు, వైద్య సహాయం తదితర సమస్యలపై అర్జీలు సమర్పించారు. అందిన ప్రతి వినతిని పరిశీలించి సంబంధిత శాఖల ద్వారా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, చైర్మన్ నాగుల్ మీరా హామీ ఇచ్చారు.

# ఆఫ్ఘనిస్తాన్‌తో వన్డే సిరీస్‌కు కోహ్లీ దూరం

ఇండియా క్రికెట్ ఫ్యాన్స్‌కు ఒకేసారి గుడ్ న్యూస్, బ్యాడ్ న్యూస్ వచ్చాయి. ఆఫ్ఘనిస్తాన్‌తో జరగబోయే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కు టీమిండియా సీనియర్ ప్లేయర్స్ రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యా జట్టులోకి తిరిగి రానున్నారు. బిసిసిఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నిర్వహించిన ఫిట్‌నెస్ అసెస్‌మెంట్‌లో వీరిద్దరూ సక్సెస్‌ఫుల్‌గా పాస్ అయినట్లు ఏఎన్ఐ వర్గాలు తెలిపాయి. ఐపిఎల్ 2026 సీజన్ లో ముంబై ఇండియన్స్ తరఫున ఆడుతున్నప్పుడు రోహిత్ హ్యామ్‌స్ట్రింగ్ గాయంతో, హార్దిక్ బ్యాక్ స్పాజమ్స్ సమస్యతో ఇబ్బంది పడ్డారు. ఇప్పుడు ఫిట్‌నెస్ క్లియరెన్స్ రావడంతో త్వరలోనే వీరు నేషనల్ స్క్వాడ్‌తో కలవనున్నారు. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ హ్యామ్‌స్ట్రింగ్ ఇంజూరీ కారణంగా ఈ వన్డే సిరీస్ నుంచి కంప్లీట్‌గా రూల్ అవుట్ అయ్యాడు. ఐపిఎల్ 2026 ఫైనల్ మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు టైటిల్ డిఫెండ్ చేసుకున్న టైంలో కోహ్లీకి ఈ గాయమైంది. కోహ్లీ రికవరీ టైమ్‌లైన్‌పై చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ అప్‌డేట్ ఇచ్చాడు. గాయం జరిగి ఇంకా వారం కూడా కాలేదని, ఫిజియోలు పరిశీలిస్తున్నారని చెప్పాడు. ఇంగ్లాండ్ వన్డే సిరీస్ నాటికి కోహ్లీ ఫిట్ అయ్యే ఛాన్స్ ఉన్నప్పటికీ, అది కచ్చితమైన సమాధానం కాదని అగార్కర్ స్పష్టం చేశాడు. కోహ్లీ ప్లేస్‌లో యంగ్ ఓపెనర్



యశస్వి జైస్వాల్‌ను వన్డే స్క్వాడ్‌లోకి తీసుకున్నారు. ఇండియా, ఆఫ్ఘనిస్తాన్ మధ్య జూన్ 13 నుంచి వన్డే సిరీస్ స్టార్ట్ కానుంది. మొదటి వన్డే జూన్ 13న ధర్మశాలలో జరుగుతుంది. రెండో వన్డే జూన్ 17న లక్నోలో, చివరి వన్డే మ్యాచ్ జూన్ 20న చెన్నైలో నిర్వహించనున్నారు. శుభ్‌మన్ గిల్ ఈ సిరీస్‌కు కెప్టెన్‌గా వ్యవహరిస్తుండగా, శ్రేయాస్ అయ్యర్ వైస్ కెప్టెన్‌గా బాధ్యతలు చూసుకోనున్నాడు. కేఎల్ రాహుల్, ఇషాన్ కిషన్ వికెట్ కీపర్లుగా ఉన్నారు. నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ, ప్రిన్స్ యాదవ్, గుర్నూర్ బ్రార్, హర్ష్ దూబే ఈ వన్డే స్క్వాడ్‌లో చోటు దక్కించుకున్నారు.

# ఒలింపిక్స్‌లో కోహ్లీని ఆడించాలి..

## టీమిండియా మాజీ క్రికెటర్ శ్రీశాంత్

లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్ 2028లో విరాట్ కోహ్లీని ఆడించాలని టీమిండియా మాజీ క్రికెటర్ శ్రీశాంత్ సూచించాడు. విరాట్ కోహ్లీ క్లాస్ బ్యాటింగ్‌కు టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ విధ్వంసం తోడైతే టీమిండియాకు తిరుగుండదని శ్రీశాంత్ అభిప్రాయపడ్డాడు. 128 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఒలింపిక్స్‌లోకి క్రికెట్ రీఎంట్రీ ఇస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఒలింపిక్ స్వర్ణమే లక్ష్యంగా టీమిండియా సిద్ధమవుతోంది. విశ్వక్రీడల్లో బరిలోకి దిగే భారత క్రికెట్ టీమ్ కూర్పుపై చర్చ మొదలైంది. తాజాగా ఓ యూట్యూబ్ ఛానెల్‌తో మాట్లాడిన శ్రీశాంత్.. ఒలింపిక్స్ ఆడేలా విరాట్ కోహ్లీని ఒప్పించాలని సెలెక్టర్లకు సూచించాడు. 'మనం ఒలింపిక్ స్వర్ణం గురించి మాట్లాడుకుంటున్నాం. అలాంటి మెగా టోర్నీలో విరాట్ కోహ్లీ తప్పకుండా ఆడాలని నేను అభ్యర్థిస్తున్నాను. అతని అపార అనుభవం, యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ లాంటి కుర్రాడి దూకుడు కలిస్తే ఆ జట్టు అద్భుతంగా ఉంటుంది. సీనియర్, జూనియర్ ఆటగాళ్ల కలయికతో జట్టును బలోపేతం చేయవచ్చు. విరాట్ కోహ్లీకి టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించినా.. ఒలింపిక్స్ ఆడేలా అతన్ని సెలెక్టర్లు ఒప్పించాలి. విరాట్ కోహ్లీ ఫిట్‌నెస్‌ను పరిగణనలోకి తీసుకోవాలి. ఇది వివాదాస్పదం కావొచ్చు.. కానీ దయచేసి విరాట్‌ను ఒలింపిక్స్ జట్టులోకి తీసుకోండి అని సెలక్టర్లను కోరుతున్నాను'అని శ్రీశాంత్ చెప్పుకొచ్చాడు.

# గురుకులంలో సైన్స్‌కు తాళం..!

మొదటి పేజీ తరువాయి

జగ్గయ్యపేట, రక్షణ న్యూస్

పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఉన్నత అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన గురుకుల విద్యాసంస్థల్లోనే సైన్స్ విద్యకు తాళం వేయడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. జగ్గయ్యపేటలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల బాలికల జూనియర్ కాలేజీలో ఎంపీసీ, బైపీసీ కోర్సులు లేకపోవడంతో విద్యార్థినులు, తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డాక్టర్లు, ఇంజినీర్లు కావాలనే ఆశయాలతో ఉన్న పేద బాలికలను బలవంతంగా ఆర్ట్స్ గ్రూపుల వైపు మళ్లిస్తున్నారని ఆరోపిస్తున్నారు. 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు గురుకులంలోనే చదువుకున్న బాలికలకు ఇంటర్ స్థాయిలో సైన్స్ విద్యను అందించకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రస్తుతం కాలేజీలో కేవలం సీఈసీ, ఎంఈసీ గ్రూపులు మాత్రమే నిర్వహిస్తున్నారు. ఎంపీసీ, బైపీసీ కోర్సులు లేకపోవడంతో సైన్స్ చదివి వైద్య, ఇంజినీరింగ్ రంగాల్లో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే విద్యార్థినుల ఆశలు అర్ధాంతరంగా నిలిచిపోతున్నాయి. కాలేజీలో మొత్తం 80 సీట్లు మాత్రమే ఉన్నాయి. వాటిలో 40 సీఈసీ, 40 ఎంఈసీ సీట్లను కేటాయించారు. సైన్స్ గ్రూపులకు ఒక్క సీటు కూడా లేకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఫలితంగా మెడిసిన్, ఇంజినీరింగ్ లక్ష్యంగా పెట్టుకున్న విద్యార్థినులు తమ కలలను పక్కనబెట్టి ఇష్టం లేకున్నా ఇతర గ్రూపుల్లో చేరాల్సిన పరిస్థితి ఏర్పడిందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ 80 సీట్ల కోసం మొత్తం ఎన్టీఆర్ జిల్లా విద్యార్థినులు పోటీ పడాల్సి వస్తుండటంతో స్థానిక విద్యార్థినులకు కూడా ప్రవేశాలు దక్కుతాయనే హామీ లేకుండా పోయింది. సీట్ల కొరత ఒకవైపు, సైన్స్ కోర్సుల లేమి మరోవైపు విద్యార్థినుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయని విద్యావేత్తలు పేర్కొంటున్నారు. అత్యంత ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, అదే ఎన్టీఆర్ జిల్లాలోని కుంటముక్కల, ముప్పాల గురుకుల జూనియర్ కాలేజీల్లో ఎంపీసీ, బైపీసీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. అయితే జగ్గయ్యపేట గురుకులంలో మాత్రం సైన్స్ కోర్సులను పూర్తిగా పక్కన పెట్టడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఒకే జిల్లాలోని ఇతర విద్యాసంస్థల్లో సైన్స్ గ్రూపులు ఉంటే, జగ్గయ్యపేటలో ఎందుకు లేవని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. సుమారు 600 మంది విద్యార్థినులు, దాదాపు 25 మంది ఉపాధ్యాయులు ఉన్న ఈ విద్యాసంస్థలో సైన్స్ విభాగాలను ప్రారంభించడానికి అవసరమైన వసతులు లేవనే వాదన కూడా సమంజసంగా కనిపించడం లేదని ప్రజాసంఘాలు పేర్కొంటున్నాయి. విద్యార్థినుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తక్షణమే ఎంపీసీ, బైపీసీ కోర్సులను ప్రారంభించాలని డిమాండ్ చేస్తున్నాయి. పేద పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్య అందిస్తున్నామని ప్రభుత్వాలు చెప్పుకుంటున్నప్పటికీ, జగ్గయ్యపేట గురుకులంలో పరిస్థితి చూస్తే పేద బాలికల భవిష్యత్తుపైనే తాళం వేసినట్టుగా ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. డాక్టర్, ఇంజినీర్ కావాలనే కలలతో ముందుకు సాగుతున్న విద్యార్థినులకు కనీస అవకాశం కూడా కల్పించకపోవడం విద్యా హక్కుల ఉల్లంఘన కాదా అని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, గురుకుల విద్యాసంస్థల అధికారులు స్పందించి జగ్గయ్యపేట గురుకులంలో ఎంపీసీ, బైపీసీ కోర్సులను ప్రారంభించాలని విద్యార్థినులు, తల్లిదండ్రులు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. లేకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపట్టక తప్పదని హెచ్చరిస్తున్నాయి. "సైన్స్ చదివే హక్కు మాకు లేదా..? మా కలలను ఎందుకు చంపేస్తున్నారు..?" అంటూ బాలికలు లేవనెత్తుతున్న ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. :::

# పాస్‌పోర్ట్ సేవల్లో ఏపీకి జాతీయ గుర్తింపు

మొదటి పేజీ తరువాయి

అమరావతి, రక్షణ న్యూస్

పాస్‌పోర్ట్ సేవల నిర్వహణలో ఆంధ్రప్రదేశ్ మరోసారి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. పాస్‌పోర్ట్ జారీ ప్రక్రియలో అత్యంత కీలకమైన పోలీసు వెరిఫికేషన్ వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేసిన రాష్ట్రాల్లో ఏపీ అగ్రస్థానాల్లో నిలిచినట్లు కేంద్ర విదేశాంగ శాఖ వెల్లడించింది. 2025-26 సంవత్సరానికి సంబంధించిన పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ డేటా ఆధారంగా రాష్ట్ర పోలీసు శాఖను అత్యుత్తమ పనితీరు కనబరిచిన వ్యవస్థల్లో ఒకటిగా ఎంపిక చేసింది. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పాస్‌పోర్ట్ సేవా దివస్‌ను నిర్వహించనున్నారు. 1967లో పాస్‌పోర్ట్ చట్టం అమలులోకి వచ్చిన రోజును పురస్కరించుకుని జూన్ 18, 19 తేదీల్లో న్యూఢిల్లీలో పాస్‌పోర్ట్ అధికారుల సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో దేశవ్యాప్తంగా పాస్‌పోర్ట్ సేవల మెరుగుదల, సాంకేతికత వినియోగం, సేవల వేగవంతం, భద్రతా ప్రమాణాలు తదితర అంశాలపై చర్చలు జరగనున్నాయి. భారత విదేశాంగ శాఖ సంయుక్త కార్యదర్శి, చీఫ్ పాస్‌పోర్ట్ అధికారి బి.ఎస్. ముబారక్ ఈ విషయాన్ని వెల్లడించారు. పాస్‌పోర్ట్ జారీ ప్రక్రియలో పోలీసు వెరిఫికేషన్ అత్యంత కీలకమని పేర్కొన్న ఆయన, ఈ అంశంలో ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ సమర్థవంతమైన వ్యవస్థను అమలు చేస్తోందని ప్రశంసించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర పోలీసు శాఖకు "స్టేట్ పోలీస్ ఆర్గనైజేషనల్ పెర్ఫార్మెన్స్ అవార్డు"ను ప్రకటించినట్లు తెలిపారు. జూన్ 19న న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ భవన్‌లో ఉన్న సీ.బీ. ముత్తమ్మ హాల్‌లో జరిగే కార్యక్రమంలో కేంద్ర విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ చేతుల మీదుగా ఈ అవార్డు ప్రదానం చేయనున్నారు.

ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆంధ్రప్రదేశ్ డీజీపీకి ప్రత్యేక ఆహ్వానం పంపినట్లు బి.ఎస్. ముబారక్ తెలిపారు. డీజీపీ స్వయంగా హాజరు కాలేని పరిస్థితిలో రాష్ట్ర పోలీసు శాఖ తరఫున మరొక సీనియర్ అధికారిని పంపవచ్చని సూచించారు. పాస్‌పోర్ట్ సేవల విషయంలో వేగవంతమైన వెరిఫికేషన్, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, ప్రజలకు సులభ సేవల అందుబాటు వంటి అంశాల్లో ఏపీ పోలీసు శాఖ కనబరిచిన పనితీరుకు గుర్తింపుగా ఈ అవార్డు లభించినట్లు అధికారులు పేర్కొంటున్నారు. కేంద్ర స్థాయిలో లభించిన ఈ గుర్తింపు రాష్ట్ర పోలీసు శాఖకు మరో గౌరవంగా నిలిచింది.

# నేటి నుంచి ఫుట్‌బాల్ మహాసంగ్రామం.

మొదటి పేజీ తరువాయి

అమరావతి రక్షణ, జూన్ 11:

ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన క్రీడా సమరానికి తెరలేవనుంది. ఫిఫా ప్రపంచకప్-2026 నేటి నుంచి ప్రారంభమై జులై 19 వరకు కొనసాగనుంది. అమెరికా, కెనడా, మెక్సికో సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్న ఈ టోర్నీ చరిత్రలోనే అతిపెద్ద ప్రపంచకప్‌గా నిలవనుంది. మొత్తం 16 నగరాల్లో 104 మ్యాచ్‌లు జరగనున్నాయి. 48 దేశాల జట్లు పాల్గొంటుండటం ఇదే తొలిసారి. ఈసారి టోర్నీ ఫార్మాట్‌లో కూడా భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. 48 జట్లను 12 గ్రూపులుగా విభజించారు. ప్రతి గ్రూపులో నాలుగు జట్లు ఉంటాయి. గ్రూప్ దశ అనంతరం అగ్రస్థానాల్లో నిలిచిన జట్లతో పాటు ఉత్తమ మూడో స్థాన జట్లు కూడా నాకౌట్ దశకు అర్హత సాధిస్తాయి. దీంతో పోటీ మరింత ఉత్కంఠభరితంగా మారనుంది. ప్రపంచకప్ తొలి మ్యాచ్‌లో ఆతిథ్య దేశం మెక్సికో, సౌతాఫ్రికాతో తలపడనుంది. మెక్సికో సిటీ స్టేడియంలో ఈ మ్యాచ్ జరగనుంది. 2010 ప్రపంచకప్ ప్రారంభ మ్యాచ్‌లో కూడా ఈ రెండు జట్లు తలపడగా ఆ మ్యాచ్ 1-1తో ముగిసింది. ఇప్పుడు స్వదేశీ అభిమానుల మద్దతుతో మెక్సికో విజయంతో టోర్నీని ప్రారంభించాలని భావిస్తుండగా, సౌతాఫ్రికా సంచలనం సృష్టించాలని చూస్తోందిడిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా మరోసారి టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. అలాగే బ్రెజిల్, ఫ్రాన్స్, స్పెయిన్, ఇంగ్లండ్, జర్మనీ, పోర్చుగల్ వంటి దిగ్గజ జట్లు కూడా కప్ కోసం పోటీ పడనున్నాయి. ప్రపంచ ఫుట్‌బాల్ అభిమానుల దృష్టి ఇప్పుడు ఉత్తర అమెరికాపైనే కేంద్రీకృతమైంది. ఈసారి ప్రపంచకప్‌కు సంబంధించిన ప్రారంభ వేడుకలు కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. మెక్సికో, అమెరికా, కెనడా దేశాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ప్రేక్షకులు ఈ టోర్నీని వీక్షించనున్నట్లు అంచనా.

26–5–26 rakshana main_Layout 1 6/12/2026 12:20 AM Page 4




# ప్రకృతి ప్రేమికుడు భారతీరాజా

## పల్లె అందాలకు చిత్రాల్లో పెద్దపీట



ప్రకృతిని ప్రేమించడం..అనుభవించడం.. ఆస్వాదించడం.. ఆనందించడం అందరికీ తెలుసు. కాన ఈప్రకృతి రమణీయకతను సెల్యూలాయిడ్‌పై చూపి ప్రేక్షకులను రంజిపం చేయడం కొందరికే తెలుసు. అందులో ముందుంటారు దర్శకలు భారతీరాజా. ఆయన తీసిన చిత్రలే అందుకు నిదర్శనం. భారతీయ సినీ ప్రపంచంలో గ్రామీణ జీవితానికి కొత్త భాషను నేర్పిన దర్శకుడు ఆయన పల్లె అందం, అక్కడి మనుషుల స్వచ్ఛమైన ప్రేమ, వారి అనుబంధాలు – ఆనందాలు, బాధలు – భావోద్వేగాలను ఎంతో సహజంగా వెండితెరపై ఆవిష్కరించడంలో ఆయన తరవాతే ఎవరైనా. ఆయన తెరకెక్కించిన ప్రతి సినిమా మట్టివాసనతో నిండిన ఓ జీవనరాగంలా అనిపిస్తుంది. ప్రేమను కవిత్వంగా, బంధాలను హృద్యంగా, ప్రకృతిని పాత్రగా మలిచిన ఆయన చిత్రాలు ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్ర వేశాయి. భావోద్వేగాలకు దృశ్యరూపమిచ్చిన ఓ గొప్ప కథకుడుగా ఆయన చిత్రసీమలో నిలిచి పోయారు. భారతీరాజా భౌతికంగా దూరమయినా, ఆయన తీసిన మణిపూసల్లాంటి చిత్రాలు నిరంతరం మన మనసులను తడుతూనే ఉంటాయి. కన్నడ దర్శకుడు పుట్టణ్ణ కనగల్, పి.పుల్లయ్య వంటి దిగ్గజాల వద్ద సహాయ దర్శకుడిగా పనిచేసి సినిమాలో మెళకువలు నేర్చుకున్నారు. అలా ఆయన పరిశ్రమలోకి అడుగుపెట్టారు.భారతీరాజా తన సినిమాల్లో ఎక్కువగా పల్లెటూరి కథలనే చూపించేవారు. మట్టివాసనను వెండితెర పైకి తెచ్చిన దర్శకుడిగా ఆయనకు పేరుంది. హీరోయిన్లను మేకప్ లేకుండా స్వచ్ఛంగా చూపించేవారు. దీని వెనుక కారణాన్ని ఆయన ఓ సందర్భంలో తనదైన చతురతను జోడించి చెప్పారు. 'ప్రకృతికాంత' అందానికి ముగ్ధుడినయ్యా. అందుకే కెమెరా పట్టుకుని ఆ అందాన్ని వెతుక్కుంటా అంటూ పల్లెలపై తన ప్రేమను వ్యక్తపర్చారు. 1977లో వచ్చిన '16 వయతినిలే' (తెలుగులో 'పదహారేళ్ల వయసు' పేరుతో రీమేక్ అయ్యింది) సినిమాతో భారతీరాజా దర్శకుడిగా పరిచయమయ్యారు. అప్పటివరకు కేవలం స్టూడియో సెట్టింగులకే పరిమితమైన తమిళ సినిమాను నిజమైన పల్లెటూరి లొకేషన్లలోకి తీసుకెళ్లి సరికొత్త ట్రెండ్‌కు శ్రీకారం చుట్టారు. ఎలాంటి మేకప్ లేకుండా హీరోలను చూపించడం, ఎలాంటి అదనపు సొగసుల జోలికి వెళ్లకుండా సహజంగా ఉన్న అమ్మాయిలను హీరోయిన్లుగా పరిచయం చేయడంతో అప్పటి సినీ సంప్రదాయాలను తిరగరాశారు. కేవలం గ్రామీణ చిత్రాలకే పరిమితం కాకుండా, 'సిగప్పు రోజాక్కల్' (తెలుగులో ఎర్ర గులాబీలు) వంటి సైకో థ్రిల్లర్ చిత్రాలతో తన బహుముఖ ప్రజ్ఞను చాటుకున్నారు. తెలుగులో ఆయన దర్శకత్వం వహించిన 'సీతాకోకచిలుక' (1981) చిత్రం అప్పట్లో పెను సంచలనం సృష్టించింది. కుల వివక్షకు వ్యతిరేకంగా ఆయన తీసిన 'వేదం పుదిదు' సినిమా సమాజంలో పెద్ద చర్చకు దారితీసింది. రాధిక, రాధ, రేవతి, కార్తీక్, విజయశాంతి వంటి ఎందరో నటీనటులను ఆయనే వెండితెరకు పరిచయం చేశారు. భారతీరాజా ప్రతిభకు ఎన్నో అవార్డులు దాసోహమన్నాయి. ఆయన తన కెరీర్‌లో దాదాపు 40 చిత్రాలకు దర్శకత్వం వహించి, 'ఇయక్కునార్ ఇమయం (దర్శక శిఖరం)' అనే బిరుదును పొందారు. జాతీయ అవార్డులు: వివిధ విభాగాల్లో మొత్తంగా 6 జాతీయ చలనచిత్ర అవార్డులను అందుకున్నారు. ఇందులో తెలుగు చిత్రం 'సీతాకోకచిలుక'కు ఉత్తమ ప్రాంతీయ చిత్ర అవార్డు కూడా ఉంది. సినీ రంగానికి ఆయన చేసిన సేవలను గుర్తిస్తూ 2004లో భారత ప్రభుత్వం 'పద్మశ్రీ' పురస్కారంతో గౌరవించింది. వీటితో పాటు 4 ఫిలింఫేర్ అవార్డులు, 6 తమిళనాడు రాష్ట్ర అవార్డులు, నంది అవార్డులను ఆయన సొంతం చేసుకున్నారు. ఆయన కేవలం దర్శకత్వానికే పరిమితం కాకుండా నటుడిగానూ అలరించారు. 'ఆయుధ ఎళుతు', 'పాండియనాడు', 'తిరుచిత్రంబలమ్' (తిరు), గతేడాది వచ్చిన విజయ్ సేతుపతి 'మహారాజా' చిత్రాల్లో కీలక పాత్రలు పోషించి మెప్పించారు. మోహన్‌లాల్ 'తుడరుమ్'లో చివరిసారి తెరపై కనిపించారు. అలాగే ఆయన నటించిన 'పులవర్' చిత్రం ఇంకా విడుదల కావాల్సిఉంది. భారతీరాజా తర్వాతితరం చిత్రనిర్మాతల కు శిక్షణ ఇవ్వడానికి 'భారతీరాజా ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సినిమా'ని స్థాపించారు.



## కలెక్షన్లలో దూసుకెళుతున్న పెద్ది

### రూ.332.1 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సాన దర్శకత్వంలో తెరకెక్కిన భారీ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా దూసుకుపోతోంది. విడుదలైన తొలి రోజు నుంచే ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణను అందుకుంటున్న ఈ చిత్రం వసూళ్ల పరంగా కూడా సత్తా చాటుతోంది. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ సినిమా కేవలం ఆరు రోజుల్లోనే రూ.332.1 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించి సంచలనం సృష్టించింది. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించిన చిత్రబృందం ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. ప్రస్తుతం ఈ పోస్టర్ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ కథలో క్రీడలు, భావోద్వేగాలు, కుటుంబ బంధాలు, పోరాట స్ఫూర్తి వంటి అంశాలను దర్శకుడు బుచ్చిబాబు సాన ఆకట్టుకునే విధంగా చూపించారు. ముఖ్యంగా రామ్ చరణ్ నటనకు ప్రేక్షకులు, అభిమానుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. హీరోయిన్‌గా జాన్వీ కపూర్ నటించగా, జగపతిబాబు, దివ్యేందు, బోమన్ ఇరానీ, రవికిషన్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించారు. సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ అందించిన పాటలు, నేపథ్య సంగీతం కూడా సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయి. సినీ వర్గాల సమాచారం ప్రకారం 'పెద్ది' చిత్రానికి ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ.218.50 కోట్ల థియేట్రికల్ బిజినెస్ జరిగినట్లు తెలుస్తోంది. ఈ సినిమా పూర్తిస్థాయి విజయాన్ని నమోదు చేయాలంటే దాదాపు రూ.220 కోట్ల షేర్ వసూలు చేయాల్సి ఉంటుంది. అంటే గ్రాస్ పరంగా రూ.440 కోట్ల మార్క్‌ను అందుకోవాల్సి ఉంటుంది. ఇప్పటివరకు రూ.332 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించిన నేపథ్యంలో బ్రేక్ ఈవెన్ చేరుకోవడానికి మరో రూ.108 కోట్ల గ్రాస్ అవసరమని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో 'పెద్ది' ఇప్పటికే బ్రేక్ ఈవెన్ సాధించినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి.

## దసరాకు షిఫ్ట్ అయిన టాక్సిక్ విడుదల

### చిత్ర వర్గాల్లో బలమైన టాక్

కన్నడ రాకింగ్ స్టార్ యష్ హీరోగా తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్' గురించి మరోసారి ఆసక్తికర వార్తలు సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతున్నాయి. కేజీఎఫ్ సిరీస్‌తో దేశవ్యాప్తంగా సంచలన క్రేజ్ సంపాదించుకున్న యష్ నుంచి వస్తున్న తదుపరి సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే సినిమా విడుదల తేదీ విషయంలో మాత్రం ఇంకా స్పష్టత రాకపోవడంతో అభిమానుల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. ప్రతిభావంతురాలైన దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో యష్ సరసన రుక్మిణి వసంత్, తారా సుతారియా నటిస్తుండగా, కీలక పాత్రల్లో హుమా ఖురేషి, కియారా అద్వానీ, నయనతార కనిపించనున్నారని సమాచారం. భారీ తారాగణం, హై బ్జడెట్ నిర్మాణ విలువలతో రూపొందుతున్న ఈ సినిమా మొదటి నుంచే దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ చిత్రం ఇప్పటికే విడుదల కావాల్సి ఉన్నప్పటికీ, మేకర్స్ సరైన సమయాన్ని ఎంపిక చేసుకునే ప్రయత్నంలో ఉన్నట్లు తెలుస్తోంది. మార్కెట్ పరిస్థితులు, ఇతర పెద్ద సినిమాల విడుదలలు, పాన్ ఇండియా స్థాయిలో బిజినెస్ అవకాశాలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని విడుదలను వాయిదా వేస్తున్నారని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. తాజాగా సమాచారం ప్రకారం 'టాక్సిక్' సినిమా ఈ ఏడాది అక్టోబర్ నెలకు షిఫ్ట్ అయ్యే అవకాశాలు ఉన్నాయట. ముఖ్యంగా అక్టోబర్ తొలి వారం లేదా మూడో వారంలో విడుదల చేయాలని మేకర్స్ ఆలోచిస్తున్నట్లు కన్నడ సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఈ వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, అభిమానులు అధికారిక ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటి వరకు చిత్ర బృందం నుంచి రిలీజ్ డేట్‌పై ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. దీంతో ఈ వార్తల్లో ఎంతవరకు నిజం ఉందనేది తెలియాల్సి ఉంది.




## ఆల్ఫా టీజర్ విడుదల

### భారీ యాక్షన్ కొత్తగా ఆలియా భట్

యశ్‌రాజ్ ఫిలిమ్స్ స్పై యూనివర్స్ నుంచి వస్తున్న 7వ సినిమా 'ఆల్ఫా' టీజర్ బుధవారం విడుదలైంది. శివ్ రావల్ దర్శకత్వంలో భారీ యాక్షన్ చిత్రంగా వస్తున్న ఈ సినిమాలో అలియా భట్ మునుపెన్నడూ చూడని సరికొత్త లుక్‌లో కనిపించింది. ఈ టీజర్‌లో అలియా భట్ ఒక ట్రైన్డ్ కిల్లర్‌గా శత్రువులపై విరుచుకుపడుతూ కనిపించగా, బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ ఆమెకు తండ్రిగా ఒక ముఖ్యమైన పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమాలో అలియా భట్ కేవలం ఒక సాధారణ అమ్మాయిలా కాకుండా, చిన్నప్పటి నుంచే పోరాటాల మధ్య పెరిగిన ఒక ప్రమాదకరమైన హంతకురాలిగా కనిపించబోతుంది. భారీ యాక్షన్ సీన్లు, గన్‌÷ట్లు, ÷టింగ్‌లతో ఆమె అదరగొట్టింది. ఈ టీజర్ సినిమాలోని యాక్షన్‌ను చూపించడమే కాకుండా, అలియా భట్, బాబీ డియోల్ పాత్రల మధ్య ఉండే బలమైన బంధాన్ని కూడా చూపిస్తోంది. మరోవైపు ఈ సినిమాలో మరో హీరోయిన్ శర్వరి కూడా నటిస్తోంది. రాబోయే రోజుల్లో ఆమె పాత్రకు సంబంధించిన వివరాలను చిత్ర బృందం ప్రకటించనుంది. బాలీవుడ్‌లో ఇద్దరు హీరోయిన్లు ముఖ్య పాత్రల్లో నటిస్తున్న అరుదైన భారీ యాక్షన్ సినిమా ఇది. యాక్షన్, సెంటిమెంట్, సస్పెన్స్, కామెడీ కలబోతగా వస్తున్న ఈ సినిమాలో అనిల్ కపూర్ కూడా ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారు. ఈ మోస్ట్ అవేటెడ్ స్పై థ్రిల్లర్ మూవీ 2026, జూలై 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.



Publisher & Printer: G. Narendra, C.G. Palem, Bapatla, Bapatla District